సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం, 7, మార్చి, 2023



నకిలీ మేత దందా

ఉత్పత్తులలో రైతుల మధ్య పోటీతత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ మేతల దందాకు అక్రమార్కులు తెరతీస్తున్నారు.

- 8లో



ప్రసవాల్లో ఫస్ట్

ప్రసవాల్లో నూజివీడు ఏరియా ఆసుపత్రి ప్రత్యేకత చాటుకుంటోంది. ఏటా వందలాది కాన్పులు చేస్తూ సేవలందిస్తోంది.

- 8లో



నిందితుడి అరెస్టు

ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన వివాహిత గొల్లపల్లి జ్యోత్స్న హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

ఆదర్శ గ్రామంగా కావలిపురం



కావలిపురం సచివాలయం

ఇరగవరం : కావలిపురం ఆదర్శ గ్రామంగా ఎంపికయ్యిందని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. కేంద్ర జలశక్తి శాఖ సభ్యులు గతంలో గ్రామంలో పర్యటించారని, వారిచ్చిన నివేదిక ఆధారంగా గ్రామం సంపూర్ణ పారిశుద్ధ్యంలో ముందంజలో ఉందని, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, నిర్మాణంలో నూరుశాతం ఫలితాలు సాధించిందన్నారు. దీంతో గ్రామాన్ని ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తించారన్నారు. స్వచ్ఛ సుజల్ శక్తికి అభివ్యక్తి పేరుతో గ్రామానికి అవార్డు వచ్చినట్టు భావిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు.

పరిష్కార వేదిక 'స్పందన'



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కారించడంలో అలసత్వం వహించవద్దని ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 13 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో చీటింగ్ కేసులకు సంబంధించినవి మూడు, కట్న వేధింపుల కేసులు మూడు, ఇతర వేధింపుల కేసులు రెండు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఐదు ఫిర్యాదులు ఉన్నాయి. అనంతరం ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా పరిష్కారం చూపాలన్నారు.

17 నుంచి శశిలో కల్చరల్ ఫెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్‌లో ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించే అన్వేషణ–2023 జాతీయస్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ వెబ్ యాప్‌ను మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. కళాశాల విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి శశి యాజమాన్యం చేస్తున్న కృషిని కొనియాడారు. యువత ఇటువంటి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. శశి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్, అన్వేషణ కో–ఆర్డినేటర్ టి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జిల్లాకు 3,770 క్యూసెక్కుల నీరు

సాక్షి, భీమవరం: దాళ్వా సీజన్‌లో జిల్లాకు 3,770 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తున్నందున, చేలకు పుష్కలంగా నీరందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నీటిపారుదలశాఖ, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. పొలాలకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆక్వా చెరువుల్లో విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు అక్రమంగా వినియోగించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అధికారుల బృందాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

పక్కాగా వారాబందీ

భీమవరం (ప్రకాశం చౌక్): పొలాలకు నీటి కొరత రాకుండా వారాబందీ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతిరోజూ ప్రతి మండలంలో వెయ్యి మంది కూలీలకు తగ్గకుండా పనులు కల్పించాలన్నారు. ఫిష్ ఆంధ్రా యూనిట్ల గ్రౌండింగ్ నత్తనడకన సాగడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు ప్రారంభింపజేయాలని ఆదేశించారు.

అనైతిక పొత్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుట్ర రాజకీయాలు

- తెలుగుదేశం, జనసేన పార్టీల రహస్య బంధం బట్టబయలు
- టీడీపీ నేతతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్
- ఇరుపార్టీల మద్దతు
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తు జిల్లాలో మరోసారి బట్టబయలైంది. ఇరు పార్టీలకు సంబంధం లేకుండా టీడీపీ చోటా నేతతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయించి అతడికి మద్దతిస్తూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సరైన మెజార్టీ లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీ అధికారికంగా ఎన్నికలకు దూరంగా ఉంటుందని పార్టీ ద్వారా సంకేతాలు ఇచ్చి.. తెరచాటున టీడీపీ నాయకులనే స్వతంత్రులుగా బరిలో పెట్టి జనసేన మద్దతుతో తెలుగుదేశం పార్టీ మరోసారి నీచరాజకీయాలకు తెరదీసింది. మొత్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి పరువు పొగొట్టుకోవడానికి టీడీపీ, జనసేన పార్టీలు సిద్ధమయ్యాయి.

ఎన్నికలకు దూరమనే భావన కలిగిస్తూ..

జిల్లాలో స్థానిక సంస్థల కోటాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు శాసనమండలి సభ్యుల పదవీకాలం ముగియనుండటంతో ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 13న మండలి ఎన్నికలు జిల్లాలోని ఐదు పోలింగ్ కేంద్రాల్లో జరుగనున్నాయి. జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో మొత్తం 1,105 ఓట్లకుగాను 879 ఓట్ల బలంతో అధికార వైఎస్సార్ సీపీ ముందంజలో ఉంది. ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలకు 200 ఓట్లు కూడా లేవు. ఈ క్రమంలో తెలుగుదేశం, జనసేన రాష్ట్ర నేతలు ఎన్నికలకు దూరమనే రీతిలో పార్టీ కేడర్‌కు సంకేతాలు ఇచ్చి పలు జిల్లాల్లో అభ్యర్థులను నిలపలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్సీల ఎన్నికల ఏకగ్రీవమైంది.

ఉమ్మడి అభ్యర్థి అంటూ..

ఉమ్మడి పశ్చిమగోదావరిలో మాత్రం సరికొత్త రాజకీయాలతో పార్టీ పరువు తీయడానికి పక్కాగా సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా నామినేషన్ చివరి రోజున నలుగురు స్వతంత్ర అభ్యర్థులతో నామినేషన్లు వేయించారు. వీరంతా టీడీపీలో గ్రామ, మండల స్థాయి నాయకులు, అది కూడా నియోజకవర్గ ఇన్‌చార్జుల విధేయులుగా ఉండే వ్యక్తులు కావడం విశేషం. చివరి నిమిషంలో నామినేషన్ వేయించి వీరిని ఎన్నికల బరిలో దించారు. ఇక వీరవాసరం టీడీపీ నాయకుడు వీరవల్లి చంద్రశేఖర్ జనసేన నాయకుల మద్దతుతో పార్టీతో సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారానికి తెరదీశారు. అది కూడా అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జులను కలిసి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అంటూ ప్రచారం చేసుకుని హడావుడి చేస్తున్నారు.



'ఫ్యాన్' దూకుడు

శాసనమండలి ఎన్నికల్లో తిరుగులేని ఓట్లతో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రచార పర్వంలో దూసుకువెళుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 11 నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, స్థానిక నాయకులు, మంత్రుల సమన్వయంతో సమావేశాలు నిర్వహించి మాక్ పోలింగ్ ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం దెందులూరు, చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో, ఈనెల 8న తాడేపల్లిగూడెంలో సమావేశాలు నిర్వహించి 15 నియోజకవర్గాల్లో ప్రచార పర్వం పూర్తి చేయనున్నారు.

పార్టీ అధిష్టానం మాత్రం దీనిపై ఏమాత్రం స్పందించని పరిస్థితి. స్థానిక నేతలు మాత్రం మా అభ్యర్థి అంటూ హడావుడి చేస్తున్నారు. వాస్తవానికి శాసన మండలి సభ్యునిగా స్థానిక సంస్థల కోటాలో ఎన్నిక కావాలంటే జిల్లాలో కనీసం 336కు పైగా ఓట్లు ఒకే రౌండ్‌లో రావాల్సి ఉంది. అయితే జిల్లాలో టీడీపీ, జనసేన, స్వతంత్రులను కలిపినా 20 శాతానికి మించి కూడా ఓట్లు లేని పరిస్థితి. ఓటమి అనివార్యం అని తెలిసినా కుల రాజకీయాలు చేస్తూ హడావుడి చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జుల నియామకం

ఏలూరు టౌన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జుల నియామకం చేపట్టారు. ఈ మేరకు సోమవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారని పేర్కొంది. ఏలూరు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన జోనల్ ఇన్‌చార్జులు వీరే..

- యూత్ వింగ్ : జక్కంపూడి గణేష్ (రాజమహేంద్రవరం సిటీ)
- రైతు విభాగం: కె.త్రినాథరెడ్డి (రామచంద్రాపురం)
- బీసీ సెల్: అల్లి రాజాబాబు (కాకినాడ)
- వైఎస్సార్‌టీయూసీ : భూపతి అజయ్‌కుమార్ (రాజోలు)
- పంచాయతీరాజ్ వింగ్ : గొల్లపల్లి బుజ్జి (ప్రత్తిపాడు)
- ఎస్టీ సెల్ : సృజన దువ్వెళ్ల (పోలవరం)
- మైనార్టీ సెల్: అబ్దుల్ బషీరుద్దీన్ (కాకినాడ సిటీ)
- స్టూడెంట్ వింగ్: నీలి వీర ఆనంద్‌కుమార్ (రాజమండ్రి సిటీ)
- దివ్యాంగుల విభాగం : తటపర్తి రాజు (చింతలపూడి)
- వైఎస్సార్ సేవాదళ్: చిన్నిమిల్లి వెంకట్రాయుడు (భీమవరం)
- డాక్టర్స్ వింగ్: డాక్టర్ వై.మురళీకృష్ణ (రామచంద్రాపురం)
- వాణిజ్య విభాగం: పెద్ది రత్నాజీరావు (కాకినాడ)
- కల్చరల్ వింగ్: ఆశా నాగుపల్లి (రాజమండ్రి)
- ప్రచార విభాగం: సీహెచ్ శ్రీనివాసరాజు (ముమ్మిడివరం)
- మహిళా విభాగం : జమ్ములమడక నాగమణి (కాకినాడ రూరల్)
- గ్రీవెన్స్ సెల్: పేని శ్రీనివాస్ (పి.గన్నవరం)
- వీవర్స్ వింగ్: పెనుగొండ శ్రీనివాసరావు (అనపర్తి)

స్పందనలో 179 అర్జీలు



భీమవరం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు సంబంధించి అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని, సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో 179 అర్జీలు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా చూసుకోవాలన్నారు. మండల స్థాయిలో అధికారులు సమస్యను పరిష్కరిస్తే అర్జీదారులు కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం ఉండదన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కూడా దరఖాస్తులు వస్తున్నాయని వాటిని ఎప్పటికప్పుడు సరిచూసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. డీఆర్వో కె.కృష్ణవేణి, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ఉండి మండలం చిలుకూరు గ్రామంలో ఐదేళ్ల క్రితం కుళాయి కనెక్షన్లు ఇస్తామని 198 మంది వద్ద పంచాయతీ అధికారులు రూ.5 వేల చొప్పున వసూలు చేశారని ఇప్పటివరకూ కనెక్షన్లు ఇవ్వలేదని పెద్ద సంఖ్యలో మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- తన భార్యకు బెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతం వచ్చిందని సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని తాడేపల్లిగూడెంనకు చెందిన ఎ.మురళి అర్జీ అందజేశారు.
- తన భర్త కరోనాతో చనిపోయారని, ఇద్దరు పిల్లలతో తాను బతుకుతున్నానని, ఎంపీహెచ్ డబ్ల్యూ శిక్షణ పూర్తిచేశానని అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని భీమవరానికి చెందిన నంబూరి మేరీగ్రేస్ కోరారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ఎమ్మెల్సీ ఎన్నికల ఆత్మీయ సమావేశాలు



భీమవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్

తణుకు అర్బన్/సాక్షి భీమవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలు, భీమవరం టౌన్‌హాల్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ దేశం మొత్తం ఇటు చూసేలా సీఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుయుక్తులు, అడ్డదారులు తొక్కినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితం ఉండదనే విషయాన్ని ఆ నాయకులు గుర్తించాలన్నారు.

అధిక మెజార్టీతో..

భీమవరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం జగన్ ఉన్నత భావాలతో మెలుగుతూ సామాజిక అంశాలకు ప్రాధాన్యమిస్తూ వెనుకబడిన వర్గాలను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్సీ అభ్యర్థులు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ అన్నారు.

మాక్ పోలింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించేలా తణుకులో మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్‌ప్రకాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, తణుకు నియోజకవర్గ ఎంపీపీలు మంగతాయారు, రుద్రా ధనరాజు, మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, అడ్డాల జానకి, పంపన అంజిబాబు, భీమవరం ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహారావు, పాలకొల్లు జెడ్పీటీసీ నడపన గోవిందరాజులునాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవాని, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, కోమటి రాంబాబు, మానుకొండ ప్రదీప్, నాగరాజు శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో మాక్ పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న మంత్రి కారుమూరి

గ్లోబల్ సమ్మిట్ చరిత్ర

విశాఖలో సీఎం జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ చరిత్రగా నిలిచిపోతుందని మంత్రి కారుమూరి అన్నారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా తణుకులో భారీ కేక్ కట్ చేశారు. ఎన్నడూలేని విధంగా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపార దిగ్గజాలు, ప్రముఖులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సువర్ణాధ్యాయమని అన్నారు.

చెరువులకు కొత్త శోభ

- 'అమృత్ సరోవర్'లో అభివృద్ధి
- 76 చెరువుల పనుల మంజూరు
- 43 చోట్ల ముమ్మరంగా సాగుతున్న వైనం
- ఉపాధి కూలీలకు చేతినిండా పని



వీరవాసరం మండలం వడ్డిగూడెంలో అభివృద్ధి చేసిన మంచినీటి చెరువు

భీమవరం (ప్రకాశం చౌక్) : మిషన్ అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా మంచినీటి చెరువుల అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలోని 70 పంచాయతీల్లో చెరువులను బాగుచేసే పనులు మంజూరు కాగా 43 చోట్ల చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే నాలుగు చెరువులను అభివృద్ధి చేయడం పూర్తయ్యింది. కార్యక్రమంలో భాగంగా కేవలం ఉపాధి కూలీలతో మాత్రమే చెరువుల్లో పూడిక తీత, గట్లు పటిష్టం, చెరువు చూట్టు వాకింగ్ ట్రాక్, మొక్కలు నాటడం వంటి పనులు చేస్తున్నారు. రెండు చెరువులు ఉన్న గ్రామంలో ఒక చెరువు పూర్తిగా ఆరబెట్టి పూడికతీత, అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

70 చెరువులు.. 1.92 లక్షల పనిదినాలు

పశ్చిమగోదావరి జిల్లాలో 70 చెరువుల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కింద 1,92,218 పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ప్రస్తుతం 43 చెరువుల పనులకు 14,034 పనిదినాల మేరకు కూలీలకు కల్పిస్తున్నారు. ఇప్పటికే నాలుగు చెరువుల అభివృద్ధి పనులు పూర్తిచేశారు.

- వీరవాసరం మండలం వడ్డిగూడెం మంచినీటి చెరువును 1,156 పనిదినాలు, రూ.2,40896 ఖర్చు చేసి అభివృద్ధి చేశారు.
- ఇరగవరం మండలం గోటేరు మంచినీటి చెరువు అభివృద్ధికి 1,488 పనిదినాలు కల్పించి రూ.3,51,059 ఖర్చు చేశారు.
- తాడేపల్లిగూడెం మండలం పొత్తూరు మంచినీటి చెరువు కోసం 4,047 పనిదినాల కల్పించి రూ.7,87,615 ఖర్చు చేశారు.
- పెనుమంట్రలో మంచినీటి చెరువు అభివృద్ధికి 647 పనిదినాలు కల్పించి రూ.1,66,279 ఖర్చు చేశారు.



ఇరగవరం మండలం గోటేరులో పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

తగ్గిన నిర్వహణ భారం

అమృత్ సరోవర్‌లో పనులు చేపట్టడం ద్వారా పంచాయతీలకు మంచినీటి చెరువుల అభివృద్ధి, నిర్వహణ పనుల భారం తగ్గుతుంది. గతంలో గ్రామాల్లోని మంచినీటి చెరువుల అభివృద్ధి పూర్తిగా పంచాయతీలు చూసుకోవాల్సి వచ్చేది. దీంతో నిధులు బాగున్న పంచాయతీల్లో మాత్రమే చెరువులు స్వచ్ఛంగా ఉండేవి. మైనార్టీ పంచాయతీల్లో ఆదాయం లేకపోవడంతో చెరువులు అభివృద్ధికి నోచుకోక పూడుకుపోయి, గట్లు దెబ్బతిని, అధ్వానంగా ఉండేవి. అలాంటి చెరువుల బాగుచేతకు అమృత్ సరోవర్ వరంలా మారింది. దీంతో పాటు గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు సమృద్ధిగా కల్పించగలుగుతున్నారు. అలాగే చిన్న పంచాయతీలకు చెరువుల అభివృద్ధి భారం తగ్గింది.

ఉపాధి హామీ పథకం	
ఉపాధి హామీ జాబ్‌కార్డులు	1,78,377
యాక్టివ్‌గా ఉన్న కార్డులు	1,27,307
కూలీల సంఖ్య	2,96,000
రోజూ పనికి వస్తున్న వారు	1,99276
వంద రోజుల పనిదినాలు పూర్తిచేసిన కుటుంబాలు	291

జూన్ నాటికి పూర్తిచేసేలా..



అమృత్ సరోవర్ పథకంలో చేపట్టిన మంచినీటి చెరువుల అభివృద్ధి పనులను వచ్చే జూన్‌నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేయడంతో పాటు పంచాయతీ, మండల పరిషత్ నిధులతో చెరువుల చూట్టూ సుందరీకరణ పనులు కూడా చేపడుతున్నాం. రెండు మంచి నీటి చెరువులు ఉన్న గ్రామంలో ఒక చెరువును ఆరబెట్టి అభివృద్ధి చేసేలా ఏర్పాట్లు చేశాం.

– ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డ్వామా పీడీ, భీమవరం

హాల్‌టికెట్ల జారీలో ఇబ్బందులుంటే చెప్పండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈనెల 15 నుంచి జరుగనున్న ఇంటర్ థియరీ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు హాల్‌టికెట్ల జారీలో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు సూచించారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు వెంటనే హాల్‌టికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. హాల్‌టికెట్ల జారీలో కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందికి గురిచేస్తే పబ్లిక్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08812 230197 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రాక్టికల్స్‌కు 5,118 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సోమవారం 5,118 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు 73 కేంద్రాల్లో 4,510 మందికి 4,434 మంది హాజరయ్యారు. అలాగే 19 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 793 మందికి 684 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు తెలిపారు.

క్లుప్తంగా

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

తణుకు టౌన్: తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో మైనర్ బాలిక వివాహాన్ని ఐసీడీఎస్, రెవిన్యూ పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. తణుకు పట్టణానికి చెందిన మహిళ తణుకు పట్టణంలోని తన బంధువుల ఇంటి వద్ద తన 14 ఏళ్ల కుమార్తెకు వివాహం చేసేందుకు సన్నాహం చేస్తుండగా చుట్టు పక్కల వారు పోలీస్, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం అందించారు. బాలిక తల్లిని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, పోలీస్ సిబ్బంది కలిసి నచ్చచెప్పడంతో బాలికకు 18 ఏళ్లు నిండే వరకూ వివాహం చేయకుండా, పాఠశాలలో చదివిస్తామని హామీ తీసుకున్నారు.

ఐఐఎంఆర్‌తో ఉద్యాన వర్సిటీ ఒప్పందం

తాడేపల్లిగూడెం: అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించిన నేపథ్యంలో భారత చిరుధాన్యాల పరిశోధనాసంస్థతో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఒప్పందం కుదుర్చుకుందని ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ సోమవారం విలేకర్లకు తెలిపారు. చిరుధాన్యాల సంవత్సర ప్రకటనతో గత రెండు నెలలుగా చిరుధాన్యాల సాగులో విధానాలు, అధిక దిగుబడినిచ్చే రకాలపై ఉద్యాన వర్సిటీ అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ నెల రెండున హైద్రాబాద్‌లో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఐఐఎంఆర్ తరఫున సంచాలకులు డాక్టర్ సి.తారా సత్యవతి, వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారన్నారు. చిరుధాన్యాల పరిశోధనా ఫలితాలను ఇచ్చిపుచ్చుకోవడం, అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సర ప్రాముఖ్యతపై జరిగే కార్యక్రమాలు రెండు సంస్థలు సమన్వయంతో నిర్వహించాలి.

ఆక్వాలో నకిలీ మేత దందా



పట్టుబడిన నకిలీ ఫీడ్ సప్లిమెంటరీ బస్తాలు (ఫైల్)



నకిలీ ఫీడ్ బస్తాల వ్యాన్ సీజ్ చేసిన పోలీసులు(ఫైల్)

- 3 టన్నుల నకిలీ ఫీడ్ పట్టుకున్న పోలీసులు
- ఆర్థికంగా నష్టపోతున్న ఆక్వా రైతులు

కైకలూరు: ఆక్వా అంటేనే రైతులకు కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వం ఆక్వా రంగానికి పలు రాయితీలు కల్పిస్తూ ఆదుకోవడంతో రైతులు ఈ రంగంలో అడుగుపెడుతున్నారు. సాగు ఉత్పత్తులలో రైతుల మధ్య పోటీతత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ మేతల దందాకు అక్రమార్కులు తెరతీస్తున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో రొయ్యల చెరువులకు ఉపయోగించే 3 టన్నుల నకిలీ మేత పట్టుబడటంతో ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 82,425.8481 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 67,044.4004 ఎకరాల్లో చేపల, రొయ్యల సాగు జరుగుతోంది. వనామీ రొయ్యల సాగుకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ఇటీవల కాలంలో రొయ్యల సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో ఈ సాగులో నకిలీ మేతల దందా పెరిగింది.

కలిదిండిలో నకిలీ ఫీడ్ కలకలం

ప్రముఖ కంపెనీలను పోలిన నకిలీ మేత(ఫీడ్ సప్లిమెంటరీ) బస్తాలను ఆక్వా రైతులకు అంటగడుతున్నారు. ఏలూరు జిల్లా కలిదిండిలో విశాఖపట్నంకు చెందిన సీ బాస్ బయో రెమిడీస్ కంపెనీ ఫినామిన్ ఆక్వా మినరల్స్‌కు నకిలీ తయారు చేసి రొయ్యల రైతులకు విక్రయిస్తున్నారు. స్థానిక కంపెనీ మేనేజరు ఫిర్యాదుతో కలిదిండి పోలీసులు వలపన్ని 3 టన్నుల నకిలీ మేతను శనివారం సీజ్ చేశారు. గుంటూరులో నకిలీ లేబుళ్ల బస్తాలను తయారు చేసి అందులో సున్నం కలిపి భీమవరం కేంద్రంగా దందా చేస్తున్నారు. రొయ్యలు త్వరగా పెరగడానికి, బలంగా ఉండటానికి ఫీడ్ సప్లిమెటరీలు అందిస్తారు. దీన్ని ఆసరా చేసుకుని నకిలీ ఫీడ్‌ను అంటగడుతున్నారు.

ఆక్వా రంగ సుస్థిరతకు చట్టాలు

ఆక్వా రంగంలో సుస్థిర అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం పలు చట్టాలను అందుబాటులోకి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఫీడ్(క్వాలిటీ కంట్రోల్) చట్టం – 2020, ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ సీడ్(క్వాలిటీ కంట్రోల్)(సవరణ) చట్టం – 2020 తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఆక్వా దుకాణాలు 874 ఉన్నాయి. ఆక్వా చెరువులు ఎక్కువగా ఉన్న కైకలూరు నియోజకవర్గంలో చిన్న, పెద్ద కలిపి 180 ఆక్వా మందుల దుకాణాలు ఉన్నాయి. ఆక్వా ల్యాబ్‌ల విషయానికి వస్తే రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి దాదాపు 230 ఉన్నాయి. కై కలూరులో రాష్ట్ర స్థాయి ఆక్వా రిఫరల్ లాబొరేటరీ అందుబాటులో ఉంది.

సీఏఏ ధ్రువీకరణ ఉంటేనే కొనాలి



ఆక్వా మందులు, మేతలు, ఫీడ్ సప్లమెంటరీలను కోస్టల్ ఆక్వా అథారిటీ(సీఏఏ) అనుమతి ముద్ర ఉంటేనే ఆక్వా రైతులు కొనుగోలు చేయాలి. ఆక్వా మేతలలో నకిలీలు గుర్తిస్తే ల్యాబ్‌లో పరీక్షలు చేసి వాటి నాణ్యత తెలుసుకోవచ్చు. ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోంది. రైతులు నష్టపోకుండా ముందే నకిలీ మేతలను గుర్తించి అధికారులకు తెలియచేయండి – ఎం.భవిత, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, కైకలూరు

కఠిన చర్యలు తీసుకుంటాం



నకిలీ లేబుళ్లతో ఆక్వా రైతులను కొందరు మోసం చేస్తున్నారు. ఆక్వా చెరువులు ఎక్కువగా ఉన్న కొల్లేరు ప్రాంతంపై ముఠా సభ్యులు దృష్టి సారిస్తున్నారు. కలిదిండి మండలంలో ఆరుగురు నకిలీ మేతల విక్రయ ముఠాను అదుపులోకి తీసుకున్నాం. మేతల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించాం. నకిలీ మేతలపై ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి.

–ఏ.మణికుమార్, ఎస్ఐ, కలిదిండి

మహిళా దినోత్సవ క్రీడల విజేతలు వీరే



పోటీల్లో గెలుపొందిన మహిళలు

సాక్షి, భీమవరం: ప్రపంచ మహిళాదినోత్సవం సందర్భంగా భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగినులకు క్రీడాపోటీలు నిర్వహించినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.సురేంద్రబాబు సోమవారం చెప్పారు. 50 మీటర్ల నడక పోటీలో ఇ.హిమజోత్స్న(యలమంచిలి), ఆర్.అరుణ(అత్తిలి), జి.మహాలక్ష్మి(తాడేపల్లిగూడెం), ఎం.బేబి(కాళ్ల) విజేతలుగా నిలిచారన్నారు. కిలోమీటర్ నడక పోటీలో డి.విజయలక్ష్మి(దిరుసుమర్రు), పి.గోవర్ధిని(భీమవరం), ఎస్‌యు ఎల్‌వీ నర్సమాంబ(మొగల్లు), ఎ.నాగలక్ష్మి(తాడేపల్లిగూడెం) విజయం సాధించారు. లెమెన్ అండ్ స్పూన్ పోటీల్లో కె.కుసుమ(తణుకు), బి.నాగలక్ష్మి(కోమటితిప్ప), ఎ.నాగలక్ష్మి(తాడేపల్లిగూడెం), ఎస్.దివ్య విజయం సాధించారు. టెన్నీకాయిట్ పోటీల్లో కె.కుసుమ(తణుకు), కె.ధరవేణి(నరసాపురం), షటిల్ పోటీల్లో ఎస్.సత్యశిల్ప(తణుకు), టి.ఉషోదయ(తాడేపల్లిగూడెం) విజేతలుగా నిలిచారని వీరికి ఈ నెల 8న నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందచేస్తారని సురేంద్రబాబు చెప్పారు.

హత్య కేసు నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్

నూజివీడు: ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన వివాహిత గొల్లపల్లి జ్యోత్స్న హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ సోమవారం వివరాలు వెల్లడిస్తూ.. ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన షేక్ నాగుల్‌మీరా(35) ముసునూరు మండలం రమణక్కపేటలో ఉన్న తన సోదరి ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గొల్లపల్లి జ్యోత్స్నను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. గత రెండేళ్లుగా నాగుల్‌మీరా అనుమానంతో వేధిస్తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. నాగుల్‌మీరా జ్యోత్స్న ఫొటోల్ని మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పెట్టేవాడు. దీనిపై ఆమె ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా జ్యోత్స్నను చంపాలని నిర్ణయించుకొని నాగుల్‌మీరా ఫిబ్రవరి 9న తిరువూరు నుంచి రమణక్కపేటకు చేరుకొని జ్యోత్స్న ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి తలుపు కొట్టాడు. ఆమె తలుపు తీయగా ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వెంట తెచ్చుకున్న కత్తితో జ్యోత్స్నను పొట్టలో, ఛాతిలో, డొక్కలో పొడవడంతో ఆమె కింద పడిపోయింది. తరువాత రాయి తీసుకొని తలపై కొట్టి, చుట్టుపక్కల వారు వస్తుండటం చూసి అక్కడ నుంచి పారిపోయాడు. హత్య అనంతరం తిరువూరు వెళ్లి, అక్కడ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లి వెళ్లి బస్టాండులో ఉంటూ టాపీ పనికి వెళ్తున్నాడు. ఈ నెల 5న తాను అద్దెకు ఉంటున్న ఇంటిలో బట్టలు తీసుకునేందుకు నాగుల్‌మీరా తిరువూరు రాగా, అతని రూం వద్ద మాటు వేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

ప్రసవాల్లో ఫస్ట్

నూజివీడు ఏరియా ఆసుపత్రిలో 2022లో 2,104 కాన్పులు



నూజివీడు ఏరియా ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం

నూజివీడు: ప్రసవాల్లో జిల్లాలో నూజివీడు ఏరియా ఆసుపత్రి ప్రత్యేకత చాటుకుంటోంది. ప్రతి ఏటా వందలాది కాన్పులు చేస్తూ పేదవర్గాలకు ఎంతో అమూల్యమైన వైద్య సేవలను అందిస్తోంది. నూజివీడు ప్రాంతంలోని 8 మండలాల్లోని పేద, మధ్య తరగతి గర్భిణులకు వైద్య సేవలందించడంలో అగ్రగామిగా ఈ ఆసుపత్రి నిలుస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భారం పడకుండా చూస్తోంది. కరోనా సమయంలో సైతం ఈ ఆసుపత్రిలో వందలాది కాన్పులు చేయడం గమనార్హం. ప్రైవేటు ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ, శస్త్రచికిత్సకు వేలాది రూపాయలు ఫీజులు రూపంలో చెల్లించాల్సిందే. అలాంటి పరిస్థితుల్లో ఆర్థిక భారం తెలియకుండా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

ఏటా సరాసరి 1750 కాన్పులు

నూజివీడు ఏరియా ఆసుపత్రి గత పదేళ్లుగా కాన్పులకు పేరుగాంచింది. సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్ గైనకాలజిస్టు కావడంతో గర్భిణులకు వైద్య సేవలందించడంతో పాటు కాన్పులు సైతం చేస్తున్నారు. ఒక్కో రోజు 6 నుంచి 8 కాన్పులు కూడా చేస్తున్నారు. ఏడాదికి సరాసరి 1750 కాన్పులు ఏరియా ఆసుపత్రిలో చేస్తుండటం గమనార్హం. నూజివీడు, ఆగిరిపల్లి, నూజివీడు టౌన్, ముసునూరు, చాట్రాయి, లింగపాలెం, చింతలపూడి, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, రెడ్డిగూడెం, మైలవరం, కృష్ణాజిల్లా బాపులపాడు తదితర మండలాల నుంచి గర్భిణులు వైద్య సేవల నిమిత్తం ఏరియా ఆసుపత్రికి వస్తారు. వీరికి నమ్మకమైన, నాణ్యమైన వైద్య సేవలందిస్తుండటంతో రానురాను ఆ సంఖ్య పెరుగుతోంది. కరోనాలో సైతం కాన్పుల సంఖ్య ఏమాత్రం తగ్గకపోవడం గమనార్హం. కరోనా కాలంలో లాక్‌డౌన్ సమయంలో గర్భిణుల ప్రసవం అతి కష్టమైంది. ఆ సమయంలో సరైన వైద్యం అందుబాటులో లేక తల్లులు తల్లడిల్లిపోయారు. అయినప్పటికీ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి కాన్పులు నిర్వహించారు. కరోనా ఉధృతంగా ఉన్న మొదటి, రెండో వేవ్‌లలో కాన్పులు గతం కంటే తగ్గకుండా చేశారు.

పేద, మధ్యతరగతి వర్గాలకు వరం

ఏరియా ఆసుపత్రిలో ప్రతి దశలోనూ ఉచితంగా వైద్య సేవలందిస్తూ పేద, మధ్య తరగతి వర్గాలపై ఆర్థిక భారం పడకుండా చూస్తున్నారు. ఇక్కడ కాన్పు అయిన తరువాత సైతం బాలింతను ఇంటికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఉచితంగా పంపిస్తున్నారు. ఈ విధంగా ఏరియా ఆసుపత్రి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తోంది.

సంవత్సరం	ప్రసవాల సంఖ్య
2018	1,644
2019	1,680
2020	1,578
2021	1,751
2022	2,104
2023	258(ఫిబ్రవరి నెల వరకు)

పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన చికిత్స

ఏరియా ఆసుపత్రికి ఎక్కువగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే వస్తున్నారు. అలా వచ్చే గర్భిణులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం. కాన్పులను సైతం సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలు చేయడానికే ప్రయత్నిస్తున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్ చేసి కాన్పులు చేస్తున్నాం.

డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, సూపరింటెండెంట్

తమ్ముడిని హత్యచేసిన అన్న



కృష్ణంరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుభాష్

గణపవరం: కోపంతో సొంత తమ్ముడినే హత్యచేశాడు అన్న. గణపవరం సీఐ ఎంవీ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం గణపవరం గొల్లలదిబ్బ ప్రాంతానికి చెందిన వేగేశ్న నర్సింహ రాజు, అతని సోదరుడు కృష్ణంరాజు కలిసి ఒకే ఇంట్లో జీవిస్తున్నారు. నర్సింహరాజుకు ఇటీవల దెబ్బతగలడంతో కాలి చిటికిన వేలు తొలగించారు. అప్పటినుండి తమ్ముడు కృష్ణంరాజు అన్న పట్ల అవహేళనగా మాట్లాడుతూ ఇంట్లో నుంచి ఎక్కడికైనా వెళ్లిపోవాలని, లేదంటే తానే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీనితో తమ్ముడిపై కక్ష కట్టిన నర్సింహరాజు ఈ నెల 5న తెల్లవారుజామున 4 గంటలకు ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న తమ్ముడు కృష్ణంరాజు తలపై గునపంతో గట్టిగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. వీఆర్‌వో ప్రసాద్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. సీఐ ఎంవీ సుభాష్, ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడు నర్సింహరాజును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు.

ఓబీసీ గుర్తింపునకు కృషిపై హర్షం



పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతున్న తూర్పు కాపు సంక్షేమ సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: తూర్పు కాపు సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారని, భవిష్యత్తులో కూడా ఈ సామాజిక వర్గానికి అన్నిరకాలుగా సౌకర్యాలు కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ఆ సంఘ నాయకులు పేర్కొన్నారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో తూర్పు కాపు సంక్షేమ సంఘ నాయకులు, పెదగోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, తూర్పు కాపు సంఘ రాష్ట్ర నాయకుడు లోపింటి చిరంజీవి, సంఘ పట్టణ అధ్యక్షుడు గెదెల శ్రీనివాసరావుతో పాటు పలువురు సంఘ నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నివసిస్తున్న తూర్పు కాపులకు కేంద్ర ప్రభుత్వం ఓబీసీ గుర్తింపు ఇచ్చేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ ద్వారా కేంద్రంలోని ఎన్‌సీబీసీకి సిఫార్సు చేశారని, త్వరలో సానుకూల ఉత్తర్వులు రానున్నాయని సంఘ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ తూర్పుకాపులకు అనేక పదవులు కల్పించారన్నారు. సమావేశంలో తూర్పు కాపు సంఘ నాయకులు జమ్ము ముత్యంజయరావు, రుంకాని దుర్గారావు, బాకూరి సత్యనిరంజన్‌రావు, పిల్లా సత్తిబాబు, పోలాపు వెంకన్న, జమ్ము కాశీ విశ్వనాథం, శిడగం రవిశేఖర్, లోపింటి శ్రీనివాసరావు, పేద్ర భక్తాంజనేయులు, గెదెల నరసింహరావు, జామాను బుజ్జి, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, గొర్రెల రాంబాబు, నడిపూడి శ్రీనివాసరావు, మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంగారపు గొలుసు అపహరణ

కాళ్ల: కాళ్ల మండలం ప్రాతాళ్ళమెరకలో 72 ఏళ్ల వృద్ధురాలి మెడలో బంగారు తాడు అపహరించుకుపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కాళ్ల పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం ప్రాతాళ్ళమెరక గ్రామానికి చెందిన అల్లూరి పద్మావతి ఇంట్లో ఒంటరిగా జీవిస్తుంది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని ఆరుకాసుల బంగారపు తాడు అపహరించుకుని వెళ్లిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలి అల్లుడు కొత్తపల్లి నారాయణరాజు కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనాస్థలిని ఎస్పీ రవి ప్రకాష్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. బాధితురాలు నుంచి వివరాలు సేకరించారు.

ట్రాక్టరు ఢీకొని వ్యక్తి మృతి

నూజివీడు: మండలంలోని పడమర దిగవల్లి వద్ద సోమవారం రాత్రి ట్రాక్టరు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన డి.ప్రకాశం(45) ద్విచక్ర వాహనంపై రమణక్కపేట వెళ్తుండగా పడమర దిగవల్లి వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి పాత బెస్ట్ కళాశాల సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ జి.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి మొత్తం 40 సీట్లకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. బీసీ, ఈబీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 లోపు జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలు 2010 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31వ తేది లోపు జన్మించి ఉండాలన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

నూజివీడు: పట్టణంలోని రామాయమ్మరావుపేటకు చెందిన బేతు నాగేశ్వరి(21) సోమవారం మందుబిళ్లలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తన గురించి కొందరు చెడుగా మాట్లాడున్నారని తీవ్ర మనస్తాపంతో సాయంత్రం 6 గంటల సమయంలో ఒకేసారి 13 డోలో ట్యాబ్లెట్లను మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సనందిస్తున్నారు. పట్టణ పోలీసులు స్టేట్‌మెంట్ నమోదు చేశారు.

ఈ-వాహన విక్రయాలు రయ్.. రయ్

- లైసెన్స్, రిజిస్ట్రేషన్ అవసరం లేదు
- చిన్నపట్టణాల్లో షోరూంలు ఏర్పాటు


గూడెంలోని ఒక షోరూంలో ఎలక్ట్రికల్ బైకులు

పెంటపాడు: పెట్రోల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. ఈ క్రమంలో వాహనదారులు ఎలక్ట్రికల్ బైక్‌ల వైపు అడుగులు వేస్తున్నారు. ఇంధన ఖర్చులు ఆదా చేసుకొనే అవకాశం ఉండడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాల వారు ఈ-వాహనాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనదారులు ఎలక్ట్రికల్ బైక్‌ల వైపు అడుగులు వేస్తున్నారు. పట్టణాలు, నగరాలలో రోజూవారీ కార్యకలాపాల కోసం 20 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించే వారంతా ఇప్పుడు ఈ వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో చిన్న పట్టణాలలో సైతం ఈ-వాహనాలు విక్రయించే షోరూంలు వెలుస్తున్నాయి. సుమారు 10కి పైగా వివిధ కంపెనీలు ఈ- వాహనాలు తయారు చేస్తున్నాయి. రూ. 60వేల నుంచి 90 వేల లోపు రేట్‌లలో వివిధ రకాల మోడళ్లు లభ్యమవుతున్నాయి. రోజుకు మూడు నుంచి నాలుగు గంటల పాటు చార్జింగ్ పెడితే సామర్థ్యాన్ని బట్టి 60 నుంచి 120 కిలోమీటర్ల మైలేజీ ఇచ్చే వాహనాలు అందుబాటులో ఉన్నాయి. క్రమంగా గ్రామీణులు సైతం వీటిపై మక్కువ చూపుతున్నారు. ఇటీవల భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో షోరూంలు వెలిసాయి. సాధారణంగా ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లిరావడం, పిల్లలను స్కూల్లో దింపి రావడం, సాయంత్రం తీసుకు రావడానికి, కూరగాయలు, పచారీ సరుకులు తెచ్చేందుకు, పొలం వెళ్లివచ్చేందుకు ఈ- వాహనాలు అందుబాటులో ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

ఇందనం ఖర్చులు ఆదా......

పెట్రోల్ తో నడిచే వాహనం కొనాలంటే ఇప్పుడు రూ. 1 లక్ష నుంచి 1.50 లక్షలు ఉంటోంది. లీటర్ పెట్రోలు 35 నుంచి 50 లోపు కిలోమీటర్లు మైలేజి మాత్రమే ఇస్తున్నాయి. అంటే ఒక్కో కిలోమీటర్‌కు రూ.2.25 నుంచి 2.50 ఖర్చవుతోంది. ఇదే ఈ-వాహనం అయితే యూనిట్ నుంచి యూనిట్‌న్నర విద్యుత్ చార్జి అంటే రూ.10 కే 60 నుంచి 120 కిలోమీటర్లు దూరం ప్రయాణించవచ్చు. కేవలం కిలోమీటర్‌కు 15 నుంచి 20 పైసలు ఖర్చవుతోంది. యూనిట్ కరెంట్‌రేట్ రూ. 6.50 ఈ లెక్కన ఎలక్ట్రికల్ బైక్ వినియోగిస్తే నెలకు నూ. 300 లోపు కరెంటుకు ఖర్చవుతోంది. అదే పెట్రోలు కోసం రూ. 3000 వరకు ఖర్చు చేయాలి. పైగా ఈ -వాహనానికి బ్యాటరీ, మోటర్ మాత్రమే ఉంటాయి. దాంతో తక్కువగా రిపేర్లు వస్తాయి. రోజుకు వంద కిలోమీటర్లు తిరగే వాహనదారులకైతే దాదాపు రూ. 10 వేలు వరకు ఇందన వ్యయం ఆదా అవుతుంది. పైగా ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్‌లు అవసరం కూడా ఉండదు.

పెరుగుతున్న వినియోగం

పట్టణాలలోనూ, పల్లెలలోనూ క్రమంగా ఈ-వాహనాల వినియోగం పెరుగుతోంది. ఒక్కొ షోరూంల్లో నెలకి సరాసరిని 10 వాహనాలు అమ్ముడవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం భీమవరం, తాడేపల్లిగూడెం షోరూమ్‌లలో గత ఏడదాదిలో దాదాపుగా 300 వాహనాలు విక్రయించినట్లు చెబుతున్నారు.

ఆదరణ పెరిగింది



ఇటీవల ఈ- వాహనాలకు ఆదరణ పెరిగింది. పెట్రోల్ ఖర్చు భారం కావడం, రిజిస్ట్రేషన్‌లు, లైసెన్స్‌లు అవసరం లేకపోవడంతో వాహనదారులు వీటిపై మక్కువ చూపుతున్నారు. నామమాత్రపు ఖర్చుతో ప్రయాణించే ఛాన్స్ ఉండటంతో అన్ని వర్గాల ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ వాహనాలు అమ్మకాలు బాగున్నాయి.

– ఇ. శ్రీనివాస్, షోరూం యజమాని దవ్వ ఎంటర్‌ప్రైజెస్, గూడెం

ఖర్చు నామమాత్రం



పట్టణంలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాను. గత ఆగస్టులో ఈ- బైక్ కొనుగోలు చేసాను. కరెంట్ నెలకు రూ. 300 మించి ఖర్చవడంలేదు. ఒక్కోసారి చార్జింగ్ పెడితే 70 నుంచి 80 కిలోమీటర్లు వస్తోంది. ఒక్కరోజు పెడితే మూడు రోజుల పాటు వస్తుంది,. నిత్యం స్కూల్‌కు వెళ్లి వచ్చిన తర్వాత స్థానికంగా వాహనంపై తిరుగుతున్నాం.

– ఈదర వెంకట్రావు, వ్యాపారవేత్త, మోయ్యేరు

నెలకు మూడు వేలు ఆదా



గతంలో బైక్ పెట్రోల్‌కు మాకు నెలకు 3 నుంచి 4 వేలు ఖర్చు అయ్యేది. ఏడాది క్రితం ఈ-వాహనం కొనుగోలు చేసాను. నా భర్త ఉదయాన్నే ఆ బైక్‌పై పిల్లలను స్కూల్‌కి తీసుకువెళ్లి ఉద్యోగానికి వెళతారు. సాయంత్రం స్కూల్ నుంచి పిల్లల్ని తీసుకొస్తున్నారు. పట్టణంలో ఏదైనా అవసరం ఉంటే ఈ- వాహనాన్ని వాడుకొంటున్నాము.

– కొవ్వూరి శిరీష, పెంటపాడు, ప్రేవేటు ఉద్యోగి

క్లుప్తంగా

మంత్రి కారుమూరిని కలిసిన రాజేష్‌బాబు


తణుకులో మంత్రి కారుమూరిని కలిసి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ది సీటీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ అధ్యక్షుడు, ఏపీ సీటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ కార్యదర్శి పి.రాజేష్ బాబు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి మంత్రి కారుమూరిని ఘనంగా సత్కరించి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు.

వెంకట్రావుపాలెం జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా


జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ ఎలిపే గాంధీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రావుపాలెం పంచాయతీ పరిధిలో జగనన్న లే అవుట్ కాలనీకి విద్యుత్‌సరఫరాను సోమవారం గ్రామ సర్పంచ్ ఎలిపే గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ మొత్తానికి ఇప్పటికే విద్యుత్ పోల్స్, లైన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా ప్రారంభించినట్లు తెలిపారు. పూర్తయిన ఇళ్లకు మంగళవారం నుంచి మీటర్లు బిగించి, విద్యుత్ సరఫరా చేయనున్నట్టు తెలిపారు. ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులు ఇంకా ఉంటే వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. ఏఈ రామకృష్ణ, లైన్‌మెన్ మల్లిఖార్జునరావు, ఉప సర్పంచ్ గుండుగోలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ భూముల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేది లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్షరూపాయలు లోపు వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. ఏప్రిల్ 23వ తేదిన ప్రవేశ పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకావాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత


గాయపడిన కార్మికులకు ఆర్థిక సాయం అంజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత నెలలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఐరన్ మేస్త్రీలు సుబ్రహ్మణ్యమ్, ప్రభుదేవ్‌లకు సోమవారం ప్రాంతీయ తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెడింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, కోశాధికారి కాకర్ల రాబాబు, మెండెం జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత విజయలక్ష్మికి సత్కారం


తణుకు పట్టణానికి చెందిన రచయిత విజయలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: రాజమహేంద్రవరంలోని స్వర రాగార్చన ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు పట్టణానికి చెందిన రచయిత విజయలక్ష్మిని సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని పుష్కర్‌ఘాట్ వద్ద గల ఎన్జీవో భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు, గాయకులు, దర్శకులు, రంగస్థల నటులను ఈ సందర్భంగా సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర రాగార్చన సంస్థ నిర్వాహకులు, ప్రముఖులు పాల్గొన్నట్లు తెలిపారు.

స్పందనకు రెండు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్నగూడెం, నందమూరు గ్రామాల నుంచి రెండు అర్జీలు అందాయని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలకు పంపించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇరగవరంలో : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో కృష్ణ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు ఆర్‌డబ్ల్యూఎస్ కి సంబంధించి, ఒక రెవెన్యూకి సంబంధించి మొత్తం 5 అర్జీలు అందాయని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలకు పంపించినున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీస్తు సువార్త సభలు

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం గ్రామంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న క్రీస్తు సువార్త స్వస్తత సభలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పడాలకు చెందిన వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ మాట్లాడుతూ బైబిలు ప్రకారం ఏసుక్రీస్తు లోకానికి వెలుగై ఉన్నాడని తెలిపారు. ఆయన చూపిన బాటలో నడచి నిందారహితులుగా విశ్వాసులు జీవించాలన్నారు. నిత్యం ప్రార్థనలతో గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్‌లు కె. ఘనరాజు, జాజిరాజు, చర్చిసంఘ సభ్యులు పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ సభ్యులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధరపై నిరసనలు


న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ రేట్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సోమవారం పట్టణంలోని శేషమహల్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడిదాన వర ప్రసాద్ మాట్లాడుతూ త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ ఎన్నికలు ముగిసేయో లేదో ఇలా గ్యాస్ బండ రేట్లు పెంచి దేశ ప్రజలపై మరింత భారాన్ని మోపిందన్నారు. వాణిజ్య, డొమెస్టిక్ ధరలను దారుణంగా పెంచిందని విమర్శించారు. ధనవంతులు ప్రయాణించే విమాన చార్జీలను నాలుగు శాతం తగ్గిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం శోచనీయం అన్నారు. గ్యాస్ ధరలు పెంచడం వల్ల నిత్యావసర వస్తువులు ధరలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమరశీల పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం, జి.రమణ, ఎం.రాంబాబు, పి.సుబ్బరాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలి


బల్లిపాడు హైస్కూల్‌లో గ్రామర్ డే సందర్భంగా మాట్లాడుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు బాలకృష్ణ

అత్తిలి: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధించి, ఉన్నత విద్యను అభ్యసించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఇంగ్లీషు గ్రామర్ డే' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ దేశ, విదేశాలకు ఎక్కడకు వెళ్లినా ఆంగ్లభాష తప్పక అవసరమన్నారు. ఆంగ్లభాషపై పట్టు సాధిసే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చాన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రావిపాడు ఉన్నత పాఠశాల నుంచి వచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయుడు బాలకృష్ణ పార్ట్ ఆఫ్ స్పీచ్ గురించి విద్యార్థులకు వివరించారు. ఆంగ్లభాషను అందరూ ఇష్టంతో నేర్చుకోవాలని కోరారు. పాఠశాల తరపున బాలకృష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రైమ్స్, సాంగ్స్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు జి ఈశ్వరరావు, ఎం వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తం, షర్మిల, యామిని, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్య సిద్ధాంతికి సత్కారం


హైదరాబాద్‌లో తణుకు పట్టణానికి చెందిన జ్యోతిష్య సిద్ధాంతి సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న సినీనటులు సుమన్, సాయి కిరణ్ తదితరులు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన జ్యోతిష్య సిద్ధాంతి ఏవీఆర్ సుబ్రహ్మణ్యంను జ్యోతిష్య వైభవ బ్రహ్మ అనే బిరుదుతో సత్కరించినట్లు ఉగాది సువర్ణ అవార్డు సంబరాల నిర్వాహకులు తెలిపారు. ఈనెల 5వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో సీపీ రామన్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంను బిరుదుతో పాటు స్వర్ణ కంకనం, దుశ్శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, సాయి కిరణ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారన్నారు.

అన్నసమారాధన


కొండ్రుప్రోలు శివాలయం వద్ద అన్నసమారాధన పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత ఉదయం స్వామి వారికి నిత్య పూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలను ఆలయ అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో స్థానిక గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెదతాడేపల్లి ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథ్, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో డ్రాఫ్టు పబ్లికేషన్

ఇరగవరం: మండలంలోని ఉప ఎన్నికలు జరగాల్సిన పంచాయతీ, వార్డులకు సంబంధించి ఆయా సచివాలయాల్లో సోమవారం డ్రాఫ్టు పబ్లికేషన్ చేయడం జరిగిందని ఎంపీడీవో కృష్ణ మోహన్ తెలిపారు. కావలిపురం సర్పంచ్, రాజీనామా చేసిన రెండో వార్డు నెంబర్‌కి, గోటేరులో 5వ వార్డుకి మొత్తం మూడు చోట్ల పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. దీనికి సంబంధించి ఓటర్ లిస్టు, పోలింగ్ స్టేషన్లు పబ్లికేషన్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు వచ్చిన వెంటనే అక్కడ పోలింగ్ నిర్వహించడం జరుగుతుంది అన్నారు.

దానేశ్వరి అమ్మవారికి దాతల విరాళాలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న దానేశ్వరి అమ్మవారి ఆలయం పునః నిర్మాణానికి విశాఖ పట్టణానికి చెందిన భక్తులు రూ. 1లక్ష 116 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం విశాఖపట్టణానికి చెందిన బూరిలా ప్రసాదరావు దంపతులు దానేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రూ. 1,00,116 లను విరాళం చెక్కును ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణకు అందజేసినట్ల తెలిపారు.

లక్ష్యాన్ని పట్టుదలతో సాధించాలి

ఆకివీడు: పట్టుదల, కృషితో లక్ష్యాన్ని సాధించుకోవాలని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కలిదిండి సత్య నారాయణరాజు అన్నారు. సహచర పూర్వ విద్యార్థులు స్థానిక ఐఎంఏ హాలులో ఆదివారం రాత్రి ఆయనను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలిదిండి మాట్లాడుతూ కెనరా బ్యాంక్‌లో గుమస్తాగా చేరిన తాను అంచెలంచెలుగా ఉన్నత పదవుల్ని అధిరోహించానన్నారు. ఈ పదవులు పదోన్నతులతో వచ్చినవి కాదని, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉన్నత స్థాయిలో జరిగినవని, వాటిలో నెగ్గుకొచ్చినట్లు ఈ స్థాయికి చేరినట్లు చెప్పారు. పూర్వపు విద్యార్థులు కొల్లి వెంకన్నబాబు, మాటూరి సుబ్రహ్మణ్యం, మోటుపల్లి ప్రసాద్, వాడపల్లి మోహన్, వేజెళ్ల దిలీప్, యర్రబోలు చిట్టిబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల 1981–82 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ద్వారా సామాజిక సేవలు విస్తృత పర్చాలి

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



అత్తిలిలో లయన్స్‌క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: లయన్స్‌క్లబ్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలిలో స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో క్లబ్ చార్టర్ నైట్ సమావేశం క్లబ్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ భవనం ఆధునీకరణకు రూ. 4లక్షలు నిధులు అందజేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. భవిష్యత్‌లో లయన్స్‌క్లబ్‌కు ఏవిధమైన సహాయ సహకారాలు అవసరమైనా తనను సంప్రదించాలని లయన్స్‌క్లబ్ సభ్యులకు తెలిపారు. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ పీఎం పంకజాక్షన్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో అత్తిలి లయన్స్‌క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఇదే ఒరవడిని భవిష్యత్‌లో కొనసాగించాలన్నారు. లయన్స్‌క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారంతో వైద్య శిబిరాల నిర్వహణతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా క్లబ్ స్థాపించినప్పటి నుంచి సేవా కార్యక్రమాలను నిర్వహించిన పలువురు క్లబ్ సభ్యులకు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చేతులు మీదుగా మెమెంటోలు ఇచ్చి, సత్కరించారు. లయన్స్‌క్లబ్ తరపున 20 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేయగా, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వృద్ధులకు రూ. 500లు చొప్పున నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ తరపున మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సన్మానించారు. క్లబ్ అభివృద్ధికి లయన్స్‌క్లబ్ సభ్యుడు దొడ్డిపట్ల కోటేశ్వరరావు కుటుంబ సభ్యుల పేరున రూ. 2లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పెన్మెత్స రామరాజు, తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జనసేన తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ విడివాడ రామచంద్రరావు, అత్తిలి మండల అధ్యక్షుడు దాసం ప్రసాద్, క్లబ్ సెక్రటరీ బీటీకే ప్రసాద్, కోశాధికారి కె చంద్రశేఖర్, ఉలుసు భాస్కరరావు, యాతం రాంబాబు, దాసం బాబ్జి, వర్ధినీడి వెంకటశివ, నిమ్మల సూరిబాబు, శీతాల వెంకట నారాయణ, కొరిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాల నిర్వహణపై సమీక్ష


జాతర మహోత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

తణుకు: ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో వేంచేసిన మంటలాంబ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఏర్పాట్లపై అమ్మవార్ల సేవల కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అడ్డగర్ల వెంకటరత్నం, ఇరగవరం ఎస్సై కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎల్.లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బొంతువారిపాలెంలో పొలంబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్

అత్తిలి: వరిచేలు ప్రస్తుతం కుదురు ఏర్పడి, చిరుపొట్ట దశలో ఉన్నందున చీడ పీడల ఉధృతి గమనించి పురుగుమందులను వాడాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. అత్తిలి శివారు బొంతువారిపాలెంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ పైరుపై కాండం తొలుచు పురుగు, ఆకుముడత ఉన్నందున వీటి నివారణకు క్లోరాంత్రిప్రోల్ 60ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయాలని, అలాగే అగ్గి తెగులు లేదా మెడవిరుపు నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయలని చెప్పారు. అగ్గి తెగులుతో పాటు మానుపండు తెగులు నివారణకు టెబుకోనాజోల్, ట్రైటప్లోక్సీస్ట్రోబిన్ మందును పిచికారీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీఏఏ మోహన్, రైతులు పాల్గొన్నారు.

నవాబుపాలెంలో మహిళా దినోత్సవం


మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు పూర్ణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సం నిర్వహించారు. ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి పి.సత్యవతి ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పొగాకు పూర్ణ, జిల్లా కమిటి సభ్యురాలు యశోలు మాట్లాడుతూ మహిళలు తమను తాము కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, సీనియర్ నాయకురాలు కండెల్లి విజయ, జిల్లా కమిటి సభ్యురాలు కండెల్లి కుమలకుమారి, ఎమ్పీటీసీ సభ్యురాలు బండి వెంకటలక్ష్మి, దార్లంగ నాగమణి, పెదగాడి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో నిల్వ ఉంచిన 4.3 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


అక్రమంగా రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

తణుకు: తణుకు మండలం వేల్పూరులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ జిల్లా ఎస్పీ కరణం కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. గ్రామానికి చెందిన బండారు భవాని శంకర్ గుప్తా నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 4,300 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈ కేసులో ఈసీ చట్టం కింద చర్య తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ దాడిలో సీఎస్‌డీటీ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.